సాక్షి పశ్చిమగోదావరి

శనివారం । 24 । ఆగస్టు । 2024



పెల్లుబికిన ఆగ్రహ జ్వాల

కోల్‌కతాలో మహిళా ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా జిల్లావ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. 8లో ▸



గణనాథుల ముస్తాబు

చవితి వేడుకలకు గణనాథులు ముస్తాబవుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వినాయక ప్రతిమల తయారీ జోరుగా సాగుతోంది. 8లో ▸



పేద విద్యార్థులకు చేయూత

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రోత్సహించేలా కేంద్రం ఏటా నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పోటీ పరీక్షలు నిర్వహిస్తోంది. 8లో ▸



దోషులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటన దారుణం. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. సమాజంలోని అలాంటి మృగాల నుంచి మహిళా వైద్యులను రక్షించేలా డాక్టర్లకు రక్షణ చట్టాన్ని తీసుకువచ్చి పక్కాగా అమలు చేయాలి. రాత్రీపగలూ మహిళా వైద్యులకు సెక్యూరిటీ పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉంటూ రక్షణ కల్పించాలి.

– డాక్టర్ సింధి ఆనంద్, గైనకాలజిస్ట్, భీమవరం ప్రభుత్వాసుపత్రి

రాత్రిళ్లు పెట్రోలింగ్ ఉండాలి



సచివాలయ పోలీస్ వ్యవస్థతో గ్రామాల్లోని హెల్త్ సెంటర్లకు రక్షణ కొంత వరకూ బాగుంది. అలాగే సచివాలయ పోలీసులు పగలు, రాత్రిళ్ల ఆయా హెల్త్ సెంటర్లను తనిఖీ చేస్తుండాలి. హెల్త్ సెంటర్లు సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే పనిచేస్తాయి. దీనివల్ల రాత్రిళ్లు సెంటర్ల వద్ద ఎలాంటి వైద్యం అందదు. రాత్రిపూట దొంగల బెడద లేకుండా పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలి.

– ఫ్లోరెన్స్, హెల్త్ అసిస్టెంట్, దుంపగడప, ఆకివీడు మండలం

న్యూస్‌రీల్

చదువుతోపాటు ఉద్యోగాన్వేషణ ముఖ్యం



అభ్యర్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

నరసాపురం: విద్యార్థులు చదువుతోపాటు ఉద్యోగావకాశాలను అన్వేషించుకుంటూ ముందుకు వెళితే త్వరగా స్థిరపడవచ్చని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం స్థానిక వైఎన్ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఉద్యోగ దిక్సూచి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ కమ్యూనికేషన్ నైపుణ్యాలు లేకపోవడంతో గ్రామీణ విద్యార్థులు అవకాశాలు పొందలేకపోతున్నారన్నారు. 420 ఉద్యోగాల భర్తీలో భాగంగా జాబ్ మేళా చేపట్టామన్నారు. 1,468 మంది నమోదు చేసుకోగా 960 మంది హాజరయ్యారు. తొలుత ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.కృష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మంగపతిరావు, డీఆర్‌డీఏ పీడీ ఎం.వేణుగోపాల్, జిల్లా ఉపాధి అధికారి వరలక్ష్మి, వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినిమిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల సమ్మె ఉపసంహరణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): బ్యాంక్ ఉద్యోగులు ఈనెల 28న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను ఉపసంహరించుకున్నట్లు అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ) నాయకులు బి.ఏడుకొండలు, ఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా యాజమాన్యం మొండి వైఖరితో 98 శాతం ఉద్యోగ సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయని, దీంతో ముంబైలో సెంట్రల్ లేబర్ కమిషనర్ సమక్షంలో బ్యాంక్ యజమాన్యం, ఏఐబీఈఏ, ఫెడరేషన్ ఆఫ్ బ్యాంకు ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ ప్రతినిధులతో సంప్రదింపులు జరిగాయన్నారు. బ్యాంక్ యాజమాన్యం చార్జిషీట్స్ క్లియర్ చేసేందుకు అంగీకరించడంతో సమ్మె ఉపసంహరించుకున్నట్లు తెలిపారు.

పాలకొల్లులో అత్యధిక వర్షపాతం

భీమవరం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా పాలకొల్లులో 115.4 మి.మీ వర్షపాతం నమోదైంది. శుక్రవారం నమోదైన వర్షపాతం వివరాలిలా.. నరసాపురంలో 75.6, యలమంచిలిలో 60.2, మొగల్తూరులో 26.4, కాళ్లలో 12.2, భీమవరంలో 8.4, వీరవాసరంలో 13.2, పోడూరులో 23.2 మి.మీ వర్షం కురిసింది. ఆచంటలో 30.2, పెనుగొండలో 32.2, ఇరగవరంలో 32.4, పెనుమంట్రలో 34.4, పాలకోడేరులో 23.4, ఉండిలో 36.8, ఆకివీడులో 18.2, గణపవరంలో 24.2, అత్తిలిలో 26.8, పెంటపాడులో 32.2, తణుకులో 30, తాడేపల్లిగూడెంలో 47.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కాంట్రాక్ట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం(ప్రకాశం చౌక్) : మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేసేందుకు పలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి సుజాతరాణి తెలిపారు. సాక్ష్యం అంగన్‌వాడీ పోషణలో బ్లాక్ కో–ఆర్డినేటర్ పోస్టులు 3 ఉన్నాయని, ఈనెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే వన్‌స్టాప్ సెంటర్‌లో కేస్ వర్కర్–1, సెక్యూరిటీ గార్డు–2 పోస్టులు, స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీలో పార్ట్ టైమ్ డాక్టర్–1, ఆయాలు–3 పోస్టులకు వచ్చే నెల 2లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ 9247273301 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నెలాఖరులోపు బియ్యాన్ని అప్పగించాలి

భీమవరం అర్బన్: జిల్లాలోని రైస్ మిల్లర్లు ప్రభుత్వం కేటాయించిన ధాన్యానికి సంబంధించి బియ్యాన్ని నెలాఖరులోపు అప్పగించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. మండలంలోని తాడేరులో శుక్రవారం ఓ రైస్ మిల్లును జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బియ్యం సేకరణ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మిల్లర్లు నూరుశాతం బియ్యాన్ని అప్పగించేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. బియ్యం ఇవాల్సిన మిల్లులను మండలాల వారీగా సమీక్షించారు. వ్యవసాయ శాఖలో అన్ని పథకాలకు ఈ–క్రాప్ నమోదును ప్రామాణికంగా తీసుకుంటారన్నారు. సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్, డీఎస్ఓ ఎన్.సరోజ, ఏఎస్ఓ ఎం.రవిశంకర్, ఏఎస్ఓ టెక్నికల్ మహమ్మద్ ఇబ్రహీం ఉన్నారు.

పెళ్లిళ్లు.. సందళ్లు

లగ్న బలం.. వివాహాలు ఘనం

- మూడు నెలల తర్వాత ఈనెల 7 నుంచి శుభ ముహూర్తాలు
- గురు, శుక్రవారాల్లో భారీగా వివాహాలు
- రెండు రోజుల్లో 3 వేలకుపైగా పెళ్లిళ్లు
- కిటకిటలాడుతున్న ఆలయాలు, కల్యాణ మండపాలు
- ఈనెల 28 వరకు ముహూర్తాలు
- తర్వాత మరో నెలన్నరపాటు మూఢం



అసలే శ్రావణమాసం.. దీనికితోడు బలమైన ముహూర్తాలు ఉండటంతో జిల్లా అంతటా పెళ్లిసందడి నెలకొంది. ఎక్కడ చూసినా పెళ్లి బాజాలే వినిపిస్తున్నాయి. ఆలయ ప్రాంగణాలు, కల్యాణ మండపాలు కళకళలాడుతున్నాయి. పెళ్లి బృందాలతో కిటకిటలాడుతున్నాయి. గురు, శుక్రవారాల్లో జోరుగా వివాహాలు జరిగాయి. వేలాది జంటలు ఒక్కటయ్యాయి.

సాక్షి, భీమవరం: శ్రావణమాసం ప్రారంభానికి మూడు నెలల ముందు నుంచి మూఢం ఉండటంతో ముహూర్తాలు లేవు. ఈనెల 5 నుంచి శ్రావణమాసం ప్రారంభంకాగా 7వ తేదీ నుంచి వివాహాలకు శుభ ముహూర్తాలు మొదలయ్యాయి. ఈనెల 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 28 తేదీల్లో పెళ్లి ముహూర్తాలు ఉండగా తర్వాత మూఢం మొదలవుతుండటంతో మరలా అక్టోబర్ 13 వరకు బలమైన ముహూర్తాలు లేవు. ఈ నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లాలో ఈనెల 7వ తేదీ నుంచి పెళ్లిళ్ల హడావుడి మొదలైంది. గత మూడు నెలలుగా అంతంతమాత్రంగా ఉన్న బంగారం, దుస్తులు, కిరాణ అమ్మకాలు జోరందుకున్నాయి. ఖాళీగా ఉన్న ఫంక్షన్ హాళ్లు బాజా భజంత్రీలు, మేళతాళాలతో సందడిని సంతరించుకున్నాయి.



రెండు రోజులు.. వేలాది వివాహాలు

పౌర్ణమి వెళ్లిన తర్వాత సప్తమికి ముందు బహుళపక్షంలో చంద్రుడు బలంగా ఉండటం వలన ఆ రోజుల్లో వచ్చే ముహూర్తాలు శ్రేష్టమైనవిగా పండితులు చెబుతుంటారు. దీనికితోడు గురు, శుక్రవారాల్లో వచ్చిన ముహూర్తాలకు గురు, రవి బలం ఎక్కువగా ఉండటంతో ఈ సీజన్‌లోనే ఇవి మంచి ముహూర్తాలని చెబుతున్నారు. ఈ కారణంతోనే గురు, శుక్రవారాల్లో పెళ్లిళ్లు జోరుగా జరిగాయి. జిల్లాలో 150 వరకు ఫంక్షన్ హాళ్లు ఉండగా వాటితో పాటు వివాహాలకు పేరొందిన ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రం, తాడేపల్లిగూడెంలోని సత్యనారయణస్వామి ఆలయం, కాళ్ల మండలం కాళ్లకూరులోని వేంకటేశ్వరస్వామివారి ఆలయం, భీమవరం గునిపూడిలోని సోమేశ్వర జనార్ధనస్వామి, పాలకొల్లులోని రామలింగేశ్వరస్వామి, నరసాపురంలోని వేణుగోపాలస్వామి తదితర ఆలయాల్లో పెళ్లి సందడి నెలకొంది. రెండు రోజుల్లో జిల్లాలో మూడు వేలకు పైగా జంటలు ఏకమయ్యాయి. తాడేపల్లిగూడెంలో శుక్రవారం ఒక్కరోజే వందకు పైగా పెళ్లిళ్లు జరిగినట్టు అంచనా. భీమవరం, తణుకు, నరసాపురం, పాలకొల్లు పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ ఎక్కడ చూసినా పెళ్లిళ్ల హడావుడి నెలకొంది.



పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో పెళ్లిసందడి



అనివేటి మండపంలో ఇలా..

అందరూ పెళ్లి పనుల్లోనే.. 22, 23 తేదీల్లో పెద్ద ముహూర్తాలు కావడంతో పురోహితులు, కల్యాణ మండపాలు, ఫొటోస్, వీడియో షూటింగ్, కేటరింగ్, షామియానా, భాజా భజంత్రీలు, మండపాల డెకరేషన్, లైటింగ్ తదితర వాటికి సంబంధించి ముందుగానే అడ్వాన్స్ బుకింగ్‌లు చేసేసుకున్నారు. ఫంక్షన్ హాల్ సామర్థ్యాన్ని బట్టి రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు చార్జీ చేస్తున్నారు. అడ్వాన్స్ బుకింగ్‌లతో ఇవి హౌస్ ఫుల్ అయిపోయాయి. ఆయా కేటగిరీల్లో సేవలందించే వారు క్షణం తీరికలేకుండా పెళ్లి పనుల్లో బిజీ అయిపోయారు.



ద్వారకాతిరుమల ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలో జరుగుతున్న వివాహం

ఇవే పెద్ద ముహూర్తాలు



ఈ శ్రావణమాసం సీజన్‌లో 22, 23 తేదీల్లో బలమైన ముహూర్తాలు వచ్చాయి. వీటికి గురు, రవి బలం బాగుండటంతో విశేషమైన ముహూర్తాలుగా చెప్పవచ్చు. ఈ రెండు రోజుల్లో పెద్ద ఎత్తున వివాహ వేడుకలు జరిగాయి. మూఢం అనంతరం అక్టోబర్ 13న పగటి ముహూర్తం విశేషంగా ఉంది.

– వేమూరి వెంకట శారద సీతారామశాస్త్రి, శ్రీవిద్య ఉపాసకులు, ఆకివీడు

శ్రీవారి క్షేత్రంలో 600కు పైగా వివాహాలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రంలో గురు, శుక్రవారాల్లో 600కు పైగా వివాహాలు జరిగాయి. పురోహితుల వేద మంత్రోచ్చరణలు, బాజా భజంత్రీలతో క్షేత్ర పరిసరాలు మార్మోగాయి. క్షేత్రంలో ఎటుచూసినా పెళ్లిజనం, నవ దంపతుల సందడి కనిపించింది. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, కొండపైన, కొండ దిగువన దేవస్థానం కల్యాణ మండపాలు, స్వామివారి పాదుకా మండపం వద్ద ఉన్న కల్యాణ మండపం, ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో అధిక సంఖ్యలో వివాహాలు జరిగాయి. ముఖ్యంగా ఆలయ అనివేటి మండపం, ఇతర ప్రాంతాలు పెళ్లివారితో కళకళలాడాయి. పెళ్లి బృందాల వాహనాలతో క్షేత్ర రహదారులు నిండిపోయాయి. కేటరింగ్, డెకరేషన్, బాజా భజంత్రీల వారు బిజీగా కనిపించారు.

దళిత నేతపై టీడీపీ దాష్టీకం

పార్టీ మారలేదని అక్కసుతో దాడి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: దళిత నేతపై సాక్షాత్తూ గ్రామ పంచాయతీ కార్యాలయంలో టీడీపీ నేత దాడి చేసి పిడిగుద్దులు గుద్ది గాయపరచిన ఘటన శుక్రవారం జరిగింది. స్టంట్ వేయించుకున్నానని చెప్పినా కూడా మెడ వంచి పొట్టలో గుద్దడం గమనార్హం. పెదవేగి మండలం ముండూరు గ్రామంలో జరిగిన ఈ ఘటన సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పెదవేగి మండలం ముండూరు గ్రామంలో శుక్రవారం ఉపాధి గ్రామ సభ జరిగింది. గ్రామ సభ అనంతరం వైఎస్సార్‌సీపీకి చెందిన గ్రామ సర్పంచ్ రాచూరి దేవి, ఆమె భర్త, దళిత నేత, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత రాచూరి బాలస్వామి గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడికి టీడీపీ నేత అన్నపనేని సురేష్ వచ్చి చేసిన పనులకు సంతకం పెట్టాలని సర్పంచ్ రాచూరి దేవికి చెప్పారు. దీనిపై ఆమె మాట్లాడుతూ ఉద్యోగుల జీతాలకు సంతకం పెడతానని, డ్రెయిన్ పనులకు ఎం–బుక్ చేయించిన తరువాత పెడతానని తెలిపారు. ఎం–బుక్ చేయించిన తర్వాత సంతకం పెడ తానన్నారు కదా అని అక్కడే ఉన్న బాలస్వామి కూడా చెప్పడంతో వెంటనే ఆగ్రహించిన సురేష్.. సర్పంచ్‌గా గెలిపించేందుకు సహకరించాను.. నా మాటకే ఎదురు చెబుతావా.. అంటూ వాదనకు దిగారు.



ముండూరు రోడ్డుపై నిరసన తెలుపుతున్న సర్పంచ్ దేవి, ఆమె భర్త బాలస్వామి

పార్టీ మారమంటే తనతోపాటు మారలేదంటూ ఆగ్రహంతో బాలస్వామిని మెడ వంచి పొట్టలో పిడిగుద్దులు గుద్దాడు. దీంతో బాలస్వామి, సర్పంచ్ రాచూరి దేవి.. ముండూరు రహదారిపై నిరసనకు దిగారు. దళితులు, గ్రామస్తులతో కలిసి ఈ కార్యక్రమం చేపట్టారు. సురేష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరి నిరసన వల్ల ట్రాఫిక్ స్తంభించి వాహనాలు నిలిచిపోవడంతో పెదవేగి ఎస్‌ఐ వచ్చి నిరసన చేస్తున్న బాలస్వామి తదితరులను రోడ్డు పక్కకు పంపించి వైద్య చికిత్స నిమిత్తం ఏలూరు వైద్యశాలకు అంబులెన్స్‌లో పంపించారు.

నిరంతరం కార్యకర్తలకు అండగా జగన్

ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

తణుకు అర్బన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరంతం పార్టీ శ్రేణులకు అండగా ఉంటున్నారని, ఎవరూ అధైర్యపడరాదని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. తణుకు దేవి సీ ఫుడ్స్ గెస్ట్ హౌస్‌లో శుక్రవారం మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో ఎమ్మెల్సీ బొత్స మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తినా, కూటమి నాయకులు దాడులు చేసినా వెంటనే జగన్ స్పందిస్తున్నారని గుర్తుచేశారు. పార్టీకి రాబోయే రోజులు మంచిగా ఉంటాయని, కార్యకర్తలు ఎటువంటి అధైర్యానికి లోనుకావద్దని స్పష్టం చేశారు. మాజీ మంత్రి కారుమూరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాల్సిందేనని, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కాబట్టి కొంత సమయం ఇచ్చి చూడాల్సి ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఎటువంటి ఇబ్బందులు గురిచేసినా అందరూ కలిసికట్టుగా పోరాడాలని, జగన్ పూర్తి భరోసాగా నిలుస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో జగన్ ప్రజలతో మరింత మమేకమవుతారన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పట్టణ జేసీఎస్ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, తణుకు మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, నాయకులు రామిశెట్టి రాము, గంజి సతీష్, వై.రామకృష్ణ, షేక్ జిలాని తదితరులు పాల్గొన్నారు.



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

నిర్ణయించిన చార్జీలకే ఇసుక రవాణా

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వం నిర్ణయించిన చార్జీలకే ఇసుక రవాణా చేయాలని జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో టిప్పర్, లారీ యజమానులు, గనులు శాఖ, రవాణా శాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు.

సమస్యలు లేకుండా.. ఉచిత ఇసుక విధానంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మైన్స్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా అన్నారు. ఉచిత ఇసుక విధానంపై అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఆర్ చేసి.. ప్రాణాలు కాపాడి..

వైద్యుడు భవాజీ సమయస్ఫూర్తి

తాడేపల్లిగూడెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న వ్యక్తి ప్రాణాన్ని అదే మార్గంలో వెళుతున్న డాక్టర్ కాపాడారు. అలంపురంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. తాడేపల్లిగూడెం కమలా హాస్పిటల్ అధినేత డాక్టర్ నార్ని భవాజీ, ఆయన సోదరుడు చినబాబుతో కలిసి తణుకు వెళ్లి తిరిగి వస్తున్నారు. మార్గమధ్యలో అలంపురం వచ్చే సరికి ఓ యువకుడు తీవ్ర రక్తస్రావంతో రోడ్డుపై పడి ఉండటాన్ని గమనించారు. భవాజీ వెంటనే క్షతగాత్రుడి వద్దకు వెళ్లి సీపీఆర్ చేశారు. దీంతో క్షతగాత్రుడిలో కదలికలు రాసాగాయి. అంబులెన్స్‌కు ఫోన్ చేయగా సమయం పడుతుందనే సమాధానం రాగా.. భవాజీ సోదరుడు చినబాబు హైవేలో ఉన్న ఎస్ఓఎస్ బాక్సు దగ్గరకు వెళ్లి ఎమర్జెన్సీ కాల్ చేయగానే అంబులెన్స్ వచ్చింది. డాక్టర్ భవాజీ అంబులెన్స్ సిబ్బందికి అత్యవసర సపర్యలను వివరించి క్షతగాత్రుడిని తణుకు ఆస్పత్రికి తరలించారు. తాడేపల్లిగూడెంలోని బంగారు దుకాణాల్లో నగల తయారీకి వచ్చిన బెంగాల్‌కు చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్టు చెబుతున్నారు. ప్రాణాపాయ స్థితి నుంచి బాధితుడిని కాపాడిన డాక్టర్ భవాజీని పలువురు అభినందించారు.



క్షతగాత్రుడికి సీపీఆర్ చేస్తున్న వైద్యుడు భవాజీ

టంగుటూరి సేవలు ఆదర్శనీయం

జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): స్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు ఆదర్శనీయమని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు జయంతి వేడుకలను నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి జేసీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రమించే గుణం, నేర్చుకోవాలని తపన, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చనే దానికి టంగుటూరి జీవితం నిదర్శమన్నారు. విద్యార్థులు, యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో విద్యార్థులు ప్రముఖుల జీవిత చరిత్రలు చదివేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. నెల పాటు ఈ కార్యక్రమాన్ని కొనసాగించి వ్యాసరచన పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ అధికారి జి.గణపతిరావు, బీసీ సంక్షేమ శాఖ శాఖ ఏబీసీడబ్ల్యూఓలు, వసతి గృహాల వార్డెన్లు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న జేసీ

క్లుప్తంగా

క్రీడలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



భీమవరంలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ దృశ్యం

భీమవరం : క్రీడలు మానసిక ఉల్లాసానికే కాకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పి.అంకమ్మ చౌదరి అన్నారు. భీమవరం పట్టణంలోని అంగర విజయలక్ష్మి-కన్నయ్య ఇండోర్ స్టేడియంలో శుక్రవారం మెంటే సుబ్బరావు, నాగరత్నం మెమోరియల్ స్టేట్ సబ్ జూనియర్ అండర్-17 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడారు. చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అకాడమీ చీఫ్ కోచ్ అంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడు రోజుల పాటు బాల, బాలికల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మెంటే పార్థసారథి, గ్రంధి సురేష్, కె.రామ్మూర్తి, బండి రమేష్‌కుమార్, మైలాబత్తుల ఐజాక్ బాబు, మెంటే వంశీ, ఇందుకూరి కిషోర్, పెన్మెత్స సత్యనారాయణరాజు, జవ్వాది కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల సత్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను సత్కరించడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎం.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 26 లోపు తమ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 85000 64372 నెంబరులో సంప్రదించాలన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మొగల్తూరు: వ్యసనాలకు బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు మొగల్తూరు ఎస్సై జి.వాసు తెలిపారు. ఆయన కథనం ప్రకారం మండలంలోని కేపీ పాలెం నార్త్‌కు చెందిన కారేపల్లి కిరణ్(32) తాపీపని చేసేవాడు. ఇటీవల మద్యానికి బానిసైన కిరణ్ భార్యతో తరుచూ గొడవ పడేవాడు. గురువారం రాత్రి భార్యభర్తలు గొడవ పడ్డారు. దీంతో ఇంటి నుండి బయటకు వెళ్ళిన కిరణ్ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట

కైకలూరు: జిల్లాలో అక్రమ మద్యం విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని ఏలూరు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) సూపరింటెండెంటు కొతారు రామకృష్ణ చెప్పారు. ఈ ఏడాది జూన్ నుంచి జూలై వరకు స్థానిక స్టేషన్ పరిధిలోని వివిధ దాడుల్లో స్వాధీనం చేసుకున్న రూ.10 వేలు విలువ చేసే అక్రమ మద్యాన్ని శుక్రవారం ధ్వంసం చేశారు. అక్రమ మద్యంపై 9440902434, 9440902448 నెంబర్లుకు సమాచారం అందించాలన్నారు.

పరస్పర కేసుల నమోదు

జంగారెడ్డిగూడెం: ఇరు వర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు జంగారెడ్డిగూడెం ఎస్సై జ్యోతిబస్ తెలిపారు. టి.నరసాపురం మండలం బొర్రంపాలెంకు చెందిన కంబాల సత్యనారాయణ దంపతులు జంగారెడ్డిగూడెంలోని నెక్కంటి పద్మజ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. సత్యనారాయణ వల్ల తనకు ప్రాణభయం ఉన్నట్లు పద్మజ ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. అలాగే పద్మజ కుమారుడు హర్షవర్ధన్ తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, వేధిస్తున్నాడంటూ సత్యనారాయణ భార్య సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనతో పాటు తన భర్త సత్యనారాయణపై దాడి చేశాడని.. తీవ్రంగా గాయపడిన తాము ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందామని సత్యవతి ఫిర్యాదులో పేర్కొంది.



మహిళా వైద్యులకు భద్రత లేదు



మహిళా వైద్యులకు సరైన భద్రత లేదు. వైద్యులను కుటుంబ సభ్యుల్లా చూసుకోవాలి. వాచ్‌మెన్ కూడా ఉండటం లేదు. ప్రాణాలకు తెగించి వైద్యులు పనిచేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద సరైన సెక్యూరిటీ లేదు. కొందరు తాగేసి వస్తున్నారు. వైద్యులకు ఏదైనా జరిగితే వైద్య సిబ్బంది మాత్రమే ఆందోళన చేస్తున్నారు. అయితే సమాజంలో అందరిపైనా బాధ్యత ఉంది. మీ ఇంట్లో వ్యక్తిలా డాక్టరును చూసుకోవాలి. మెడికల్ కాలేజీల్లో ఒక్కోసారి 36 గంటలు డ్యూటీ చేయాల్సి వస్తుంది. అలాంటి వైద్యులకు ప్రత్యేక గదులుండాలి. కోల్‌కతా వంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.

– డాక్టరు అనూష, కాగుపాడు పీహెచ్‌సీ వైద్యురాలు , ఉంగుటూరు

మహిళా సిబ్బందికి భద్రత కల్పించాలి



ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేస్తోన్న మహిళా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ప్రాణాలకు తెగించి వైద్య సేవలు అందిస్తారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది తమ ప్రాణాలను లెక్కచేయకుండా సేవలు అందించారు. అలాంటి వారికి సరైన రక్షణ లేకపోతే ఎలా సేవలందించగలరు. కోల్‌కతాలో పీజీ వైద్యురాలిపై సభ్య సమాజం సిగ్గుతో తల దించుకునేలా హత్యాచారానికి పాల్పడటాన్ని ప్రతి ఒక్కరూ ఖండిస్తున్నారు. రోగులను కాపాడేందుకు ఎంతో శ్రమిస్తున్న మహిళా వైద్యులు, నర్సుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి.

– ఎం.రూత్ రికెట్స్, హెడ్ నర్స్, ఏలూరు జీజీహెచ్

పెల్లుబికిన ఆగ్రహజ్వాల



ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటరులో సీఆర్ రెడ్డి విద్యార్థుల మానవహారం



కోల్‌కతా ఘటనకు నిరసనగా భీమవరంలో డీఎన్నార్ విద్యార్థుల ర్యాలీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే దోషులకు కఠిన శిక్షలు పడినప్పుడే ఈ హత్యాచారాలు ఆగుతాయని సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కే వెంకటేశ్వరరావు అన్నారు. కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో ట్రైనీ పీజీ వైద్య విద్యార్థినిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ సీఆర్‌ఆర్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థినిలు, అధ్యాపకులు శుక్రవారం సాయంత్రం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రాణాలను నిలబెట్టే వైద్యులకే రక్షణ కల్పించలేకపోతే, ఇతర సాధారణ మహిళలకు రక్షణ ఎక్కడ లభిస్తుందన్నారు. తొలుత కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ ఫైర్ స్టేషన్ వరకూ చేరుకుంది. అక్కడ మానవహారం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకూ సాగింది. కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ సత్య నాగమణి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో..

భీమవరం : ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం కేసులో దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం భీమవరం డీఎన్నార్ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ యూనిట్స్, శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు మాట్లాడుతూ ఈ ఘటన అత్యంత దారుణమని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.మోజెస్, ఎన్ఎస్ఎస్ మేజర్ ఎ.వీరయ్య మాట్లాడుతూ సమాజంలో స్త్రీని గౌరవించినప్పుడే భారతీయులకు సార్థకత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కె.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



నరసాపురంలో విధులు బహిష్కరించి కోర్టు వద్ద న్యాయవాదుల నిరసన

కఠినంగా శిక్షించాలి

నరసాపురం : కోల్‌కతా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని నరసాపురం న్యాయవాదుల సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. కోర్టు వద్ద నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకూ ప్రదర్శన చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ మాట్లాడుతూ పైశాచికంగా వ్యవహరించిన వారికి తగిన శిక్ష పడాలన్నారు. ఇలాంటి ఘటనలు పురావృతం కాకుండా బలమైన చట్టాలు అమల్లోకి తేవాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి రంపా పుల్లాజీ, ఉపాధ్యక్షుడు కొత్తపల్లి రమేష్, మహిళా ప్రతినిధి బొడ్డు ప్రగతి, కోశాధికారి పూరిళ్ల శ్రీనివాస్, కురెళ్ల సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ ముఠా అరెస్టు



భీమవరం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ భీమారావు

భీమవరం: భీమవరంలో గురువారం జరిగిన దారిదోపిడి కేసులో నలుగురిని చాకచక్యంగా అరెస్టు చేసినట్లు అదనపు ఎస్పీ వి.భీమారావు చెప్పారు. టూటౌన్ పోలీసుస్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కాళ్ల మండలం కోపల్లి గ్రామానికి చెందిన కోన రమేష్ ఈ నెల 22న భీమవరం మండలం చినఅమిరం అంబేడ్కర్ సెంటర్ మీదుగా బైక్‌పై వెళ్తుండగా.. చినఅమిరం గ్రామానికి చెందిన కొడాలి సతీష్, బిరుదుగడ్డ నరేష్, గూడపాటి ఉదయ్‌కుమార్, తెనాలి దావీదు చాకుతో రమేష్‌ను బెదిరించి అతని పర్సులోని రూ.5 వేలు దోచుకున్నారు. బాధితుడు శుక్రవారం ఉదయం 11 గంటలకు ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసిన టూటౌన్ సీఐ కాళీచరణ్, ఎస్సై రహమాన్ దర్యాప్తు ప్రారంభించారు. మధ్యాహ్నం 2 గంటలకు నిందితులను భీమవరం హాస్పటల్ వెనకున్న శ్మశానం వద్ద అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు. కొడాలి సతీష్‌పై గతంలో టూటౌన్ పోలీసుస్టేషన్‌లో హత్య కేసు, ఉదయ్‌కుమార్‌పై మొగల్తూరు, భీమవరం టూటౌన్ పోలీసుస్టేషన్‌లలో, తెనాలి దావీదుపై టుటౌన్ పోలీసుస్టేషన్‌లో పాత కేసులున్నాయని చెప్పారు.

గణనాథుల ముస్తాబు



తుది మెరుగులు దిద్దుకుంటున్న విగ్రహాలు

ఆకర్షణీయమైన రంగులతో గణనాథుడు



ఆకట్టుకుంటున్న చిన్న ప్రతిమలు

చవితి కోసం గణనాథులు సిద్ధమవుతున్నారు. మట్టి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో వివిధ రూపాల్లో విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. వినాయక ప్రతిమల తయారీకి తణుకు పెట్టింది పేరు. రాజస్తాన్ నుంచి వలస వచ్చిన కొందరు గత ఇరవై ఏళ్లుగా ఇక్కడ బొమ్మలు తయారు చేస్తున్నారు. ఇక్కడి రంగు రంగుల విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రెండు అడుగుల నుంచి 12 అడుగుల వరకు విగ్రహాలు ఆకర్షిస్తున్నాయి. రూ.100 నుంచి రూ.20 వేల వరకు ధరలున్నాయి.

–తణుకు

పశువులకు ప్రమాదకారి..

బ్రూసెల్లోసిస్



జంగారెడ్డిగూడెం : పశువుల్లో బ్రూసెల్లోసిస్ ప్రమాదకరమైన వ్యాధి. ఈ వ్యాధి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో టీకాలు అందిస్తున్నాయి. బ్రూసెల్లోసిస్ వ్యాధి గురించి పశువైద్యాధికారి డాక్టర్ టీఆర్ శ్రీనివాసన్ పలు వివరాలు వెల్లడించారు.



బ్రూసెల్లోసిస్ అంటే

బ్రూసెల్లోసిస్ బ్రూసెల్లా బ్యాక్టీరియా వల్ల పశువుల్లో వ్యాపిస్తుంది. గేదెలు, మేకలు, గొర్రెలు, పందులపై ప్రభావం చూపుతుంది. ఈ వ్యాధి జంతువుల నుంచి మనుషులకు సోకే అవకాశం ఉంది.

లక్షణాలు

పశువులలో గర్భస్రావం, మగ జంతువులలో వంధ్యత్వం, పాల ఉత్పత్తి తగ్గడం వంటివి కనిపిస్తాయి.

వ్యాప్తి

ఈ వ్యాధి సంక్రమించిన జంతువుల స్రావాలతో ప్రత్యక్ష సంపర్కం లేదా మాంసం లేదా పాశ్చ్‌రైజ్ కాని పాల వినియోగం, గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది.

నివారణ చర్యలు

టీకాలు వేయించాలి. ఎప్పటికప్పుడు జంతువులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలి. పశువుల పాకలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. వ్యాధి సంక్రమించిన జంతువులను వేరు చేసి వ్యాప్తిని నివారించవచ్చు.

దూడలకు ఉచిత టీకా కార్యక్రమం

2019లో భారత ప్రభుత్వం జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమాన్ని (ఎన్‌ఏడీసీపీ) ప్రారంభించింది. దీని కింద 4 నుంచి 8 నెలల వయసు గల ఆడ దూడలకు ఉచిత టీకాలు వేయడంతో పాటు.. వ్యాధి నిర్ధారణకు ప్రయోగశాల పరీక్షలు చేస్తారు. పశు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామ స్థాయిలో టీకా శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. పశువులకు సకాలంలో టీకాలు వేయించాలి. అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే వెంటనే పశు వైద్యుడిని సంప్రదించాలి. మనుషులు పాశ్చరైజ్ చేసిన పాలను మాత్రమే వినియోగించాలి.

మనుషులకు కూడా వ్యాపించే ప్రమాదం



బ్రూసెల్లోసిస్ పశువుల్లో వచ్చే ప్రమాదకర వ్యాధి. ఇది మనుషులకు కూడా వ్యాపించే అవకాశం ఉంది. దీని నివారణలో రైతుల పాత్ర చాలా ముఖ్యమైనది. ఏవైనా సందేహాలు ఉంటే స్థానిక పశుసంవర్ధక శాఖ అధికారులను సంప్రదించి తగు జాగ్రత్తలు పాటించాలి

– టీఆర్ శ్రీనివాసన్, పశువైద్యాధికారి

రక్షణ పరిశోధనలో స్వావలంబన



డాక్టర్ బీవీ రావును సత్కరిస్తున్న నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి

తాడేపల్లిగూడెం : రక్షణ, పరిశోధన రంగాల్లో భారత దేశం స్వావలంబన సాధించి ప్రపంచానికి స్ఫూర్తిగా నిలుస్తుందని అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లేబోరేటరీ డైరెక్టర్ (ఏఎస్ఎల్, డీఆర్‌డీఓ) విశిష్ట శాస్త్రవేత్త డాక్టర బీవీ పాపారావు అన్నారు. నిట్‌లో శుక్రవారం జరిగిన ఇండక్షన్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పరిశోధనల్లో కొత్త శిఖరాలను అధిరోహించడం అత్యంత అవసరమన్నారు. విద్యార్థులు చేపట్టే నూతన ఆవిష్కరణలు ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేలా ఉండాలన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. కొలువుల సాధనకు సాంకేతిక నైపుణ్యాలు కీలకమని , వాటిపై పట్టు సాధించాలన్నారు. నిట్ రిజిస్ట్రార్ దినేష్ రెడ్డి మాట్లాడుతూ నిర్దేశించుకున్న లక్ష్యాలను నాలుగేళ్ల శ్రమించి విద్యార్థులు ఉన్నత స్థితికి చేరాలన్నారు.

చైన్ స్నాచింగ్‌పై ఫిర్యాదు

కొయ్యలగూడెం : ఒంటరిగా నడిచి వెళ్తున్న మహిళ మెడలో నుంచి దుండగుడు చైన్ దొంగిలించిన సంఘటన శుక్రవారం రాత్రి కొయ్యలగూడెంలో చోటు చేసుకుంది. కొయ్యలగూడెం వైఎస్సార్ నగర్‌కు చెందిన బక్క వెంకటలక్ష్మి తన ఇంటి నుంచి సమీప బంధువుల ఇంటికి వెళ్తుండగా బైక్‌పై వచ్చిన యువకుడు మెడలోని పన్నెండు కాసుల బంగారు తాడును తెంపుకొని వెళ్లిపోయాడు. దుండగుడు ఆరెంజ్ కలర్ చొక్కా ధరించి ఉన్నాడని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేద విద్యార్థులకు చేయూత

- నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌లో రూ.12 వేల సాయం
- జిల్లాలో గతేడాది 144 మంది ఎంపిక



భీమవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతిభావంతులైన పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పోటీ పరీక్షలు నిర్వహిస్తోంది. దీనికి ఈ ఏడాదికి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ కాగా, దరఖాస్తుకు సెప్టెంబర్ 15 వరకూ గడువుంది. ప్రభుత్వ పాఠశాల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే పోటీపరీక్షకు అర్హులు. అర్హత సాధిస్తే 9వ తరగతి నుంచి సీనియర్ ఇంటర్ వరకూ ఏటా రూ.12 వేల చొప్పున ఉపకార వేతనాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. జిల్లాలో 2022లో 198 మంది, 2023లో 144 మంది విద్యార్థులు ఎంపికయ్యారు.

పరీక్ష విధానం

మెంటల్ ఎబిలిటీ టెస్ట్(మ్యాట్)లో 90 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలుంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 90 మార్కులు కేటాయిస్తారు. స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (శాట్)లో 90 ప్రశ్నలుంటాయి. మొత్తం 90 మార్కులు. 7, 8వ తరగతుల స్థాయిలో సైన్స్, సోషల్, మ్యాథ్స్ పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. నెగిటివ్ మార్కులు ఉండవు. ఫిజిక్స్‌లో 12 మార్కులు, కెమిస్ట్రీలో 11, బయాలజీలో 12, మ్యాథ్స్ 20, హిస్టరీ 10, జాగ్రఫీ 10, పొలిటికల్ సైన్స్ 10, ఎకనామిక్స్‌లో 5 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి.

అర్హతలు

7వ తరగతిలో 55 శాతం మార్కులు సాధించి ఉండాలి. తుది ఎంపిక నాటికి 8వ తరగతిలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు 50 శాతం మార్కులు సాధిస్తే చాలు. ప్రభుత్వ, మున్సిపల్, జెడ్పీ, ఎయిడెడ్ పాఠశాలల్లో రెగ్యులర్ విధానంలో చదివే విద్యార్థులు మాత్రమే అర్హులు. విద్యార్థి తల్లిదండ్రుల కుటుంబ వార్షికాదాయం రూ.3.50 లక్షలకు మించకూడదు. రాత పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేసే పరీక్షలో ఓసీ జనరల్, బీసీ, పీహెచ్ విద్యార్థులకు 40 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 32 శాతం మార్కులు రావాలి.

దరఖాస్తు విధానం

రాష్ట్ర ప్రభుత్వ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆయా పాఠశాలల్లో ఇచ్చి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా సెప్టెంబర్ 15లోపు దరఖాస్తు చేయించుకోవాలి. పరీక్ష ఫీజు రూ.100. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజులో 50 శాతం మినహాయింపు ఉంటుంది. దరఖాస్తు ఫారాలు, ధ్రువీకరణ పత్రాలు సెప్టెంబర్ 15 లోపు డీఈఓ కార్యాలయంలో అందజేయాలి. అర్హులైన విద్యార్థులకు డిసెంబర్ 8న పోటీ పరీక్ష నిర్వహిస్తారు.

ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ఉపయోగం



పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు అందజేసే మెరిట్ స్కాలర్‌షిప్ ఎంతో ఉపయోగకరం. ఆర్థిక ఇబ్బందులున్నా ఉన్నత చదువులు అభ్యసించాలనే ఆశయం ఉన్న విద్యార్థులకు ఎంతగానో దోహదం చేస్తుంది.

– జి.నాగమణి, జిల్లా విద్యాశాఖాధికారిణి, భీమవరం



చట్టాలను కఠినంగా అమలు చేయాలి



ఆస్పత్రిలో రాత్రి సమయంలో విధుల్లో ఉండే మహిళా వైద్యులు, నర్సులు భయాందోళనతో విధులు నిర్వర్తిస్తున్నారు. వైద్యం కోసం కొందరు, తగాదాల్లో కొందరు ఆస్పత్రికి వచ్చే పరిస్థితుల్లో మద్యం మత్తులో రావడం వైద్యవర్గాలపై దాడులకు దిగుతుండడం వంటి ఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి. కోల్‌కత్తా ఘటనతో ఈ భయం మరింత ఎక్కువై నైట్ డ్యూటీ చేయాలంటే మహిళలు భయపడుతున్నారు.

– వైవీఎస్‌బీ రాయుడు, ఏపీవీవీపీ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యదర్శి, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

దోషులను శిక్షించాలి



పశ్చిమ బెంగాల్‌లో వైద్యురాలిపై జరిగిన అటవిక చర్యలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. కోల్‌కతా సంఘటన దురదృష్టకరం. వైద్యకళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో మహిళా డాక్టర్లకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి. ఆస్పత్రిలోకి వచ్చే బయట వారిపై సరైన నిఘాపెట్టాలి. మత్తు పదార్థాలు సేవించేవారిపై చర్యలు తీసుకోవాలి

– డాక్టర్ పూజిత, ముదునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి

క్లుప్తంగా

చంద్రయాన్‌-3 మోడల్ తయారీలో రత్నకుమారికి ప్రథమం



విద్యార్థిని రత్నకుమారిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం రూరల్: జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా భీమవరంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయిలో నమూనా పోటీలు నిర్వహించారు. చంద్రయాన్‌-3, విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లను రూపొందించి ఈ పోటీల్లో ప్రదర్శించడం ద్వారా మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన మరపట్ల రత్నకుమారి ప్రథమ బహుమతి సాధించినట్లు స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. తద్వారా రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు. క్విజ్ పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని వీరమళ్ల పద్మశ్రీ తృతీయ స్థానం సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా వారిని గ్రామ సర్పంచ్ పిల్లా రాంబాబు, పాఠశాల విద్యాకమిటి చైర్మన్ మరపట్ల పండియ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆడిట్

తాడేపల్లిగూడెం: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం ఆడిట్ జరిగింది. జిల్లా రిజిస్ట్రార్ రెడ్డి సత్యనారాయణ, ఆడిటర్ డీఆర్ ఎం.పార్వతిలు ఆడిట్ చేసి రికార్డులను పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ డౌన్‌లో ఉండటంతో రిజిస్ట్రేషన్లకు అంతరాయం కలిగింది. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

బలుసులమ్మకు విశేష పూజలు



విశేష అలంకరణలో బలుసులమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వెలవలపల్లి ప్రదీప్ శర్మ, గోపీనాథ్ శర్మ, బాదంపూడి మల్లిఖార్జునశర్మలు బ్రహ్మత్వంలో అమ్మవారికి విశేషంగా పూజలు నిర్వహించారు. దాతలు మార్నీడి అశోక్, మౌనిక దంపతులుచే అన్నసమారాధన జరిగింది. ఆలయ కార్యనిర్వాహణాధికారి రవి శంకర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని, పూజలను నిర్వాహకులు శ్రీరంగం అంజిబాబు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో ప్రజలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

పౌష్టికాహారంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

తణుకు: తణుకులోని ఎస్ఎన్‌వీటీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్ విభాగంలోని విద్యార్థులకు పౌష్టికాహారం వినియోగంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దీపిక పాల్గొని విద్యార్థులకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సునీత, స్వరూప, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలందరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి. లక్ష్మణరావు పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా స్థానిక బేబి సెంటర్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం 10, 11, 12 వార్డుల్లో ఫ్రై డే, డ్రై డే ఆరోగ్య కార్యక్రమాలు, సర్వేలు,హెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ పరిశీలన బృందాలు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఫీవర్ సర్వేలు చేయాలన్నారు. దోమ లార్వాలు ఉత్పత్తి కాకుండా చూడాలని, వాటిని అరికట్టాలని, దోమలు కుట్టకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు మేరీ, పోసమ్మ, మంగతాయారు, లక్ష్మి, శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి తీర్మానాలు అవసరం

ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్



తణుకు టౌన్: దువ్వలో గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

తణుకు టౌన్: గ్రామాల్లో అభివృద్ధి పనుల నిర్వహణకు, ప్రభుత్వ నిధుల కేటాయింపు గ్రామ సభల తీర్మాణాల ద్వారానే జరుగుతుందని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ చెప్పారు. శుక్రవారం ప్రభుత్వం చేపట్టిన గ్రామ సభల కార్యక్రమాల్లో భాగంగా ఆయన దువ్వలో జరిగిన గ్రామ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసభకు గ్రామ సర్పంచ్ అడ్డా బాబు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేలా శాసన మండలిలో ప్రశ్నిస్తానని చెప్పారు. దువ్వ గ్రామంలో ఇప్పటికి మంచినీటి సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదన్నారు. గ్రామ సభల తీర్మాణాల ద్వారానే ప్రభుత్వం నుంచి నిధులను రాబట్టవచ్చని తెలిపారు. గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను ఈ గ్రామ సభల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, ఎంపీడీవో కే కిరణ్‌కుమార్, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శి జీ భాస్కర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. తణుకు మండలంలోని వేల్పూరు గ్రామంలో సర్పంచ్ విశ్వనాథం కృష్ణ వేణి అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. కోనాల, ముద్దాపురం, తేతలి, కొమరవరం, మహాలక్ష్మీ చెరువు, యర్రాయి చెరువు గ్రామాల్లో గ్రామ సర్పంచ్‌లు మల్లిపూడి చిన్నయ్య, మజ్జి పద్మ, సరెళ్ల క్రాంతిప్రియ, కరిబండి రాజేష్, పాలా శ్రీను, కేతా వెంకట లక్ష్మీ గ్రామ ప్రత్యేక అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో 18 గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు



అత్తిలి: గ్రామసభలో మాట్లాడుతున్న సెక్రటరీ సుజాత



ఇరగవరం: గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

అత్తిలి: గ్రామాలు ఆర్థిక పరిపుష్టి సాధించినప్పుడే ప్రగతి సాధ్యపడుతుందని ఎంపీడీవో ఎండీ అమీలుజమా అన్నారు. శుక్రవారం అత్తిలి మండలంలో 18 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. అత్తిలిలో సర్పంచ్ గంటావిజేత నాగరాజు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో సెక్రటరీ సుజాత మాట్లాడుతూ రాబోయే కాలంలో గ్రామానికి ఏఏ అవసరాలు ఉన్నాయనేది గుర్తించి, ఆపనులకు గ్రామసభ తీర్మానాల ద్వారా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించాల్సి ఉందన్నారు. సామాజిక, మౌలిక సదుపాయాల కల్పన వంటి వాటికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. మట్టపర్తి గర్వులో ఆక్రమణలు తొలగించి, మురుగునీటి డ్రెయిన్ ఏర్పాటు చేయాలని, ఇరిగేషన్ అతిథి గృహం నుంచి ఫైర్‌స్టేషన్ వరకు రోడ్డు వెంబడి ఉన్న చెత్తమొక్కలను తొలగించాలని, బస్‌స్టేషన్ నుంచి పాలూరు డ్యాం వరకు కచ్చా డ్రెయిన్ ఏర్పాటు చేయాలని, గ్రామంలో కుక్కల బెడదను నిర్మూలించాలని, అరుంధతిపేటలో సీసీ రోడ్డు, డ్రెయిన్ల సమస్యలు, కల్వర్టు నిర్మాణాలు, చినపేటలో రక్షితనీరు సరఫరా అయ్యే ట్యాప్‌లు సరిగా పనిచేయడంలేదని, గ్రామంలో దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయాలని పలువురు ప్రజలు, వార్డు సభ్యులు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, బీజేపీ నాయకుడు తోట త్రిమూర్తులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 21 గ్రామ పంచాయతీలలో గ్రామసభలు

ఇరగవరం: మండలంలో 21 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించినట్లు ఎంపీడీవో ఏ శ్రీనివాస్ తెలిపారు. గ్రామసభల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన పనులను ప్రతిపాదించాలని గ్రామ ప్రజలను కోరారు. 36 పనులకు రూ.2.37 కోట్లు, సీసీరోడ్లు, డ్రెయిన్‌ల కోసం నిధులు మంజూరు కోసం తీర్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, టీడీపీ మండల అధ్యక్షుడు గోపిశెట్టి రామకృష్ణ, జనసేన నాయకుడు పోతుల గంగాధరరావు, ఈఓఆర్డీ నరశింహమూర్తి పాల్గొన్నారు.

ప్రజావసరాలు తీర్చేందుకు కృషి చేస్తాం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజల అవసరాలు తీర్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని అప్పారావుపేట గ్రామంలో జరిగిన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 13,326 పంచాయతీల్లో ఒకే రోజు గ్రామసభలు నిర్వహించడం రికార్డుగా పేర్కొనవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, పెంటపాడు మండల అధ్యక్షుడు పుల్లా బాబి, కూటమి నాయకులు పాల్గొన్నారు. మిగిలిన 30 గ్రామాల్లోనూ ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపుపై గ్రామ సభలు నిర్వహించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తణుకు టౌన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కే కృష్ణకుమారి తెలిపారు. శుక్రవారం వేల్పూరు గ్రామంలోని కేంద్రాల ఆధ్వర్యంలో మండల పరిషత్ 5 ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన మిషన్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళలకు, బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాధాకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలి



పట్టణంలో హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించి తమ ప్రాణాలు కాపాడుకోవాలని ట్రాఫిక్ ఎస్ఐ కొండలరావు అన్నారు. పట్టణంలో శుక్రవారం హెల్మెట్ ధరించాలంటూ ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ కొండలరావు మాట్లాడుతూ హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే ప్రాణాలు రక్షించుకోవచ్చునని చెప్పారు. ట్రాఫిక్ సిబ్బంది, యువతీ యువకులు పాల్గొన్నారు.

నాలుగు సెల్ ఫోన్స్ రికవరీ

భీమవరం: భీమవరం రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మొబైల్ మిస్సింగ్ కేసుల్లో నాలుగు సెల్ ఫోన్స్ రికవరీ చేసినట్లు రైల్వే ఎస్సై పీటీవీ రమణ శుక్రవారం చెప్పారు. ఈ సందర్భంగా బాధితులకు ఫోన్స్ అందజేశారు. సెల్‌ఫోన్స్ మిస్సింగ్ కేసుల్లో సీఈఐఆర్ యాప్ ద్వారా నాలుగు ఫోన్స్ రికవరీ చేయగా వాటి విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని ఎస్సై రమణ చెప్పారు.

మండుటెండ.. కుండపోత



శుక్రవారం ఉదయం వర్షంతో తడిచి ముద్దయిన తణుకు పట్టణం



సాయంత్రం సమయంలో విజృంభిస్తున్న సూర్యుడు

- మండుతున్న ఎండ.. అంతలోనే వాన
- విచిత్ర వాతావరణంతో ప్రజల అవస్థలు

తణుకు: ప్రస్తుతం వాతావరణం చాలా విచిత్రంగా ఉంటోంది. అసలు ఏ కాలమో తెలియని విధంగా ప్రవర్తిస్తోంది. ఉదయం నుంచే సూర్యుడు ఎండతో బెంబేలెత్తిస్తున్నాడు. వేసవి కాలం మాదిరిగా విజృంభిస్తున్నాడు. తణుకు నియోజకవర్గంలో ఇటీవలి కాలంలో అంతలోనే వరుణుడు రంగంలోకి దిగుతున్నాడు. దాదాపు గంటసేపు వాన కురిపిస్తున్నాడు. ఆయన డ్యూటీ అయ్యాక మళ్లీ సూర్యుడు ప్రత్యక్షమవుతున్నాడు. వాతావరణంలో వచ్చిన మార్పులలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జ్వరాలు, ఒళ్లనొప్పులు, దగ్గు తదితర రోగాలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

గ్లోబల్ వార్మింగ్..?

ఎండకాలంలో భానుడి వేడితో అల్లాడిన ప్రజలు వర్షాకాలంలో ఆహ్లాదకర వాతావరణంతో సేద తీరు తుంటారు. గతంలో ఎప్పుడు ఇలాగే జరిగింది. వర్షాకాలంలో ఎండ కాసినా అంత ప్రచండంగా ఉండేది కాదు. అయితే ఇప్పుడు మాత్రం ఒకపక్క వరుణుడు, మరోపక్క భానుడు పోటాపోటీగా ప్రజలపై తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. ఉదయం నుంచే ఎండ రావడంతో ఉక్కపోత ఎక్కువై పోతోంది. వేసవి కాలం మాదిరిగా ఇళ్లలో ఏసీలు పనిచేయాల్సి వస్తోంది. మరోవైపు ఇంతలోనే కుండపోతగా వర్షం కురుస్తుంది. వాతావరణంలో ఇంత మార్పు రావడానికి ప్రధాన కారణం గ్లోబల్ వార్మింగ్ అని నిపుణులు చెబుతున్నారు. దాని వల్ల ఇలాంటి విచిత్ర వాతావరణం నెలకొందన్నారు. నేలపై పచ్చని చెట్లు లేకుండా నరికి వేయడంతో ఈ పరిస్థితికి ప్రధాన కారణమని స్పష్టం చేస్తున్నారు. గతంలో నగరాలలో చెట్లను నరికివేశారని, ఇప్పుడు ఓ మాదిరి పెద్ద గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి ఏర్పడిందంటున్నారు. చెట్లను నరికివేయడంతో ఎండలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, దానివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగిపోవడం, తోటలు, పచ్చని పొలాలను నాశనం చేసి లేఅవుట్లు వేయడం వల్ల గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోయిందని చెబుతున్నారు. వారం రోజులుగా ఉష్ణోగ్రత 33 డిగ్రీలకుపైగా నమోదు అవుతోంది. కేవలం గురు, శుక్రవారం మాత్రం ఒక మోస్తరు వర్షం కురుస్తోంది.

పెరిగిన ఏసీల వినియోగం...

గతంలో వేసవి కాలంలోనే ఏసీలను బాగా ఉపయోగించేవారు. మిగిలిన కాలాలలో వాటి వినియోగం ఉండేది కాదు. అయితే ప్రస్తుతం పరిస్థితి మారింది. కాలానికి సంబంధం లేకుండా ఏసీలు వినియోగించాల్సి వస్తోంది. ప్రస్తుతం వర్షాకాలమైనా ఏసీల వినియోగం బాగా పెరిగింది. ఎండలు బాగా పెరిగిపోవడంతో వాటి వాడకం తప్పనిసరి అయ్యింది. ఇక రోడ్డు పక్కన వ్యాపారం చేసుకున్న చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయమే ఎండ రావడంతో ఉత్సాహంగా వ్యాపారం ప్రారంభిస్తున్నారు. అంతలోనే వాన కురవడంతో ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు పక్కన వస్తువులను పేర్చి విక్రయాలు జరిపేవారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాన కురిసినప్పుడు వాటిని సర్దుకోవడం చాలా ఇబ్బందిగా మారుతోంది. అనుకోకుండా వర్షం కురవడంతో ప్రజలు బయటకు రావడం లేదు. దీనివల్ల వ్యాపారాలు కూడా సక్రమంగా లేదు.

సీఐటీయూ ఆధ్వర్యంలో తణుకులో నిరసన



తణుకులో నిరసన తెలియజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

తణుకు: మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం అయ్యాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ విమర్శించారు. ఇటీవల కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన ఘటనకు సంబంధించి సీఐటీయూ, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో శుక్రవారం తణుకులో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చి 78 ఏళ్లు అయినప్పటికీ మహిళలకు రక్షణ లేకపోవడం బాధాకరమన్నారు. రోడ్డుపై పట్టపగలే వెళ్లడానికి భయపడే పరిస్థితులు ఉండటం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. పెరుగుతున్న అన్ని రకాల భారాలు కారణంగా ఒక్కరితో కుటుంబ పోషణ సాధ్యం కాకపోవడంతో మహిళలు కూడా పని చేయాల్సిన అవసరం పెరిగిందన్నారు. అన్ని రంగాలలో మహిళలు ముందుకు వెళుతున్నప్పటికి హత్యలు, హత్యాచారాలు, లైంగిక వేధింపులు వంటివి ప్రతిభ ఉన్నవారిని అడ్డుకోవడం జరుగుతుందన్నారు. మహిళలపై జరుగుతున్న హత్యలు, హత్యాచారాలు, గృహహింస, లైంగిక, ర్యాగింగ్ వంటి వేధింపులపై పార్లమెంట్, శాసనసభలలో చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు గార రంగారావు, మండలం అధ్యక్షుడు ఎన్.ఆదినారాయణబాబు, వై.మందులయ్య, అనంతలక్ష్మి, కుసుమ, జ్యోతి బాబు, కృష్ణబాబు, లలితకుమార్, వై.రాంబాబు, పద్మ, ధనలక్ష్మి, మంగమ్మ, రాజేశ్వరి, ఆదిలక్ష్మి, కొమ్మర రాణి, అచ్యుతకుమారి, కాకి రమణ, మీసాల సరిత తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీసుందరిబాయి

తణుకు టౌన్: చంద్రయాన్‌-3 విజయంతో భారత్ అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించిందని తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ యూ లక్ష్మీ సుందరి బాయి చెప్పారు. శుక్రవారం భారత మొదటి అంతరిక్ష దినోత్సవం సందర్భంగా కళాశాలలో నిర్వహించిన వేడుకలకు ఆమె అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇస్రో అద్భుతమైన పనితీరును, పరిశోధనలో భారతదేశ మార్గదర్శక పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించి దేశం గర్వించే శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు మాట్లాడుతూ మాట్లాడుతూ జాతీయ అంతరిక్ష దినోత్సవం అంతరిక్ష పరిశోధన ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడానికి, అంతరిక్ష విద్యను ప్రోత్సహించడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుందన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం అంతరిక్ష పరిశోధన ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడానికి, అంతరిక్ష విద్యను ప్రోత్సహించడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై, చంద్రయాన్ ప్రయోగంపై క్విజ్, పోస్టర్ పెయింటింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రూపవల్లీ, వెంకటలక్ష్మీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరి జీవితం నేటి తరానికి ఆదర్శనీయం



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు



బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో టంగుటూరి జయంతి

తణుకు టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలుగుజాతి ముద్దు బిడ్డ, ఆంధ్ర కేసరి, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేఆర్ ఫణిధర్, కళాశాల చరిత్ర అధ్యాపకుడు శివ ప్రకాశ్, అధ్యాపకులు, భూపాల్, కే జీవన్ బాబు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో...

తణుకు సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు టంగుటూరి ప్రకాశం పంతుల జీవిత చరిత్రపై వకృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ మంగు సూర్యప్రకాశ్, పీ సీతారామయ్య చౌదరి, కాజా లీలారాణి, మైపాల దుర్గా ప్రసాద్, మోహనరావు, ఆర్‌వీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్వాతంత్ర్యోద్యమంలో టంగుటూరి పాత్ర ఎనలేనిదని పలువురు వక్తలు కొనియాడారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు బ్రాహ్మణ సేవా పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు పుల్లాభొట్ల వెంకట సూర్యనారాయణ మూర్తి, కోశాధికారి ప్రవా శ్రీనివాస్, గరికపాటి బాపయ్య శర్మ, కె.శ్రీనివాస్, ఆత్మరామ్, కృష్ణవేణి, కోపల్లె శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలి



కొవ్వాడ అన్నవరంలో పొలంబడి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్

భీమవరం అర్బన్: వ్యవసాయంలో భూ సార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలని ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్ రైతులకు సూచించారు. భీమవరం మండలంలోని కొవ్వాడ అన్నవరం గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సాగులో విచక్షణ రహితంగా ఎరువులు వాడితే ఖర్చులు పెరిగిపోతాయన్నారు. భూ సార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎంత మోతాదులో ఎరువులు వాడాలో అంతే వాడాలన్నారు. కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా వాడకూడదని చెప్పారు. అలాగే పురుగు మందులు ఎక్కువగా వాడటం వల్ల మిత్ర, శత్రు పురుగులు మృత్యువాత పడతాయని మిత్రపురుగులను రక్షించుకునేందుకు తక్కువగా వాడాలన్నారు. వరినారి దొరకని రైతులు వెదజల్లే పద్ధతిని అనుసరించాలన్నారు. ఈ విధానం వల్ల రెండు వారాలు సమయంతో పాటు సుమారు రూ. 5 వేలు వరకు ఖర్చు ఆదా అవుతుందన్నారు. మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాసు మాట్లాడుతూ వరినాట్లు వేసిన రైతులు తప్పకుండా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. పొలం బడి 14 వారాల పాటు జరుగుతాయన్నారు. సాగులో సమస్యలు, అధిక దిగుబడి సాధించేందుకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు స్వేత, మౌనిక, సుందర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత మృతికి సంతాపం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మోదుగ గుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కామన చంద్రరావు మృతికి మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మోదుగ గుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కామన చంద్రరావు శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా చంద్రరావు భౌతికకాయాన్ని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, కొమ్ముగూడెం సొసైటీ మాజీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, సర్పంచ్ పోతుల అన్నవరం, చిల్లిముంతల మారియ్య, అరుంధతీ యూత్ సభ్యులు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.